క్లుప్తంగా

పట్టణ ఎస్‌ఐగా శ్రీనివాస గౌడ్


శ్రీనివాస గౌడ్

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ పట్టణ ఎస్‌ఐగా శ్రీనివాస గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఏఎస్‌ఐ విధులు నిర్వహిస్తూ పదోన్నతి పొందిన శ్రీనివాసగౌడ్‌ను నంద్యాల జిల్లాకు కేటాయించగా దిశ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా నియమించి ఆళ్లగడ్డ పట్టణ ఎస్‌ఐగా అటాచ్ చేశారు. దీంతో ఆయన శనివారం పట్టణ సీఐ యుగంధర్‌ను కలుసుకుని బాధ్యతలు చేపట్టారు. కాగా ఇప్పటికే పట్టణానికి ఇద్దరు ఎస్‌ఐలు ఉన్నారు. తాజాగా మరొకరి నియామకంతో ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్‌లో మొదటి సారిగా ముగ్గురు ఎస్‌ఐలు విధులు నిర్వహిస్తున్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ


క్రీడాదుస్తులతో విద్యార్థులు,ఉపాధ్యాయులు

దొర్నిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాల బాలికలకు హెచ్‌ఎం చెన్నకేశ్వరీ శనివారం క్రీడా దుస్తులు అందజేశారు.గతంలో ఇదే పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు వాటిని సమకూర్చారు. క్రీడాపోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చాలని ఈ సందర్భంగా ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీ దేవేంద్ర, ఉపాధ్యాయులు రమణయ్య, మల్లిఖార్జున, మౌలాలి, చెన్నయ్య, నరసింహ, నాగరాజు, సరస్వతి, సునంద, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయం


ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి అమ్మన్నరాజ

నంద్యాల(వ్యవసాయం): ఆర్థిక స్థోమత లేని ఖైదీలు దరఖాస్తు చేసుకుంటే ఉచిత న్యాయం సహాయం అందజేస్తామని మూడవ అదనపు జిల్లా జడ్జి అమ్మన్నరాజ అన్నారు. నంద్యాల సబ్ జైల్‌ను శనివారం న్యాయమూర్తి తనిఖీ చేసి మాట్లాడారు. రిమాండ్ ఖైదీలు శిక్ష కాలం అనంతరం సత్ప్రవర్తనలో మెలగాలని సూచించారు. ఖైదీల ఆరోగ్య విషయాలు, జైల్‌లో కల్పిస్తున్న వసతుల గురించి జైలు సూపరింటెండెంట్ గురుప్రసాదరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సిబ్బంది రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమాచార శాఖ ఉద్యోగికి సత్కారం


ఆంజనేయులు దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్, జేసీలు

నంద్యాల: సమాచార శాఖలో 32 సంవత్సరాల పాటు పనిచేసిన ఫొటోగ్రాఫర్ ఆంజనేయులు అందించిన సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమాచార పౌర సంబంధాల శాఖలో పబ్లిసిటీ అసిస్టెంట్ (ఫొటోగ్రాఫర్) పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ రామునాయక్, డీఐపీఆర్‌ఓ పురుషోత్తం తదితరులు పాల్గొని ఆంజనేయులు దంపతులను సత్కరించారు.

రక్తదానంతో ప్రాణదాతలు కండి


రక్తదానం చేస్తున్న యువకులు

నంద్యాల(వ్యవసాయం): ఆపదలో ఉన్నవారిని రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఉప్పు జగన్‌ప్రసాద్, జయప్రకాష్‌రెడ్డి, చల్లా మధు అన్నారు. గణేష్ ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని విశ్వనగర్, గణేష్ ఉత్సవ కమిటీ రామనాథరెడ్డినగర్, గజాసాబ్ గజారాజ్ యూత్ ఆధ్వర్యంలో యువకులు రక్తదానం చేశారు. వీరిని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అభినందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కోలుకోలేక కౌలు రైతు మృతి

ఆళ్లగడ్డ: అప్పుల బాధతో ఆత్మహత్యా యత్నం చేసుకున్న కౌలు రైతు రామరాజు (39) కోలుకోలేక మృతి చెందారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల గ్రామానికి చెందిన రామరాజు తనకున్న రెండున్నర ఎకరాల పొలంతో పాటు మరో 10 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. పెట్టుబడులు, తదితర వాటికి సుమారు రూ. 7 లక్షలు అప్పు చేశాడు. అయితే, సరిగ్గా పంటలు పండకపోవడతో అప్పు తీర్చే మార్గం కనిపించలేదు. ఈక్రమంలో ఈ నెల 23వ తేదీ పురుగుల మందు తాగి ఆహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలు వైద్యశాలకు తరలించగా కోలుకోలేక శనివారం మృతి చెందాడు. భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ సురేష్‌రెడ్డి తెలిపారు

నిమజ్జనానికి సర్వం సిద్ధం!

- చిన్న చెరువు కట్ట వద్ద గణనాథుల నిమజ్జనోత్సవం
- 5 ర్యాంప్‌లు, ఆరు క్రేన్‌లు ఏర్పాటు
- భారీ పోలీసు బందోబస్తు
- నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, ఆర్‌డీఓలు


గణేష్ నిమజ్జనోత్సవానికి ముస్తాబైన వినాయకఘాట్


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, ఆర్‌డీఓ, మున్సిపల్ అధికారులు


వినాయక ఘాట్ వద్ద చేరిన భారీ క్రేన్


ఘాట్ వద్ద రోడ్డును చదును చేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): గణనాథుల నిమజ్జనానికి నంద్యాలలో ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఆదివారం చిన్న చెరువు కట్ట వద్ద ఈకార్యక్రమం కనుల పండువగా సాగనుంది.గణేష్ కేంద్ర ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు శనివారం వినాయక ఘాట్‌ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసు ఉన్నతాధికారులు అవసరమైన చర్యలు చేపట్టారు. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలను విధించారు. ఆదివారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు నిమజ్జనోత్సవం జరగనుండటంతో చెరువు కట్టపై పెద్ద ఎత్తున ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆటోలు, ట్రాక్టర్లలో తీసుకొచ్చిన విగ్రహాలను చిన్న చెరువులో నిమజ్జనం చేయడానికి 5 ర్యాంప్‌లను, ఆరు క్రేన్‌లను ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిషా, ఆర్‌డీఓ విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ శేషన్న పరిశీలించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

800 మంది పోలీసులతో బందోబస్తు

గణేష్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు ఉన్నతాధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. దాదాపు 800 మంది పోలీసులను బందోబస్తు విధులకు నియమించారు. అలాగే పలు ఆంక్షలను విధించారు. ఉత్సవాల్లో టపాసులు పేల్చరాదు, అలాగే మద్యం సేవించి పాల్గొనరాదు. కల్పనా సెంటర్ నుంచి వరుస క్రమంలో విగ్రహాల ఊరేగింపు నిర్వహించాలి. కల్పనా సెంటర్, బైర్మల్‌వీధి, మెయిన్ బజార్, గాంధీచౌక్, పార్కురోడ్ ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు నిషేధం. సున్నితమైన ప్రదేశాల్లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్లను ఏర్పాటు చేయడం జరిగింది. విద్యుత్ సమస్య తలెత్తకుండా, ఊరేగింపులో విగ్రహాలకు విద్యుత్ వైర్లు తగలకుండా పర్యవేక్షణకు 25 ప్రదేశాల్లో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. ఫిషరీష్ శాఖ ఆధ్వర్యంలో వినాయక్ ఘాట్ వద్ద పదిమంది గజ ఈతగాళ్లు, బోట్లను ఏర్పాటు చేశారు. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు వినాయక ఘాట్, జగజ్జననీనగర్, హరిజనవాడ, ఎస్‌జీటీస్ కాలనీ, గాంధీచౌక్, శ్రీనివాసనగర్, గాంధీనగర్, దేవనగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు.

విగ్రహాలతో ఇలా రావాలి..

నూనెపల్లి, టెక్కె, సాయిబాబానగర్, ఎన్‌జీఓ కాలనీ, ఎస్‌బీఐ కాలనీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను శ్రీనివాస సెంటర్ మీదుగా బాలాజీ కాంప్లెక్స్, ఫరూక్‌నగర్, ఆత్మకూరు బస్టాండ్ మీదుగా వినాయక ఘాట్‌కు తీసుకొని రావాలి. అక్కడి నుంచి వరుసగా వెళ్లాల్సి ఉంటుంది. రైల్వే స్టేషన్ ఏరియా, మూలసాగరం, బొమ్మలసత్రం ప్రాంతాల్లోని విగ్రహాలను ఆర్టీసీ బస్టాండ్ ద్వారా నేరుగా విక్టోరియా రీడింగ్ రూం వద్దకు చేరాలి. విక్టోరియా రీడింగ్ రూం, మెయిన్ బజార్, గాంధీచౌక్, పార్కురోడ్డు మీదుగా వినాయక ఘాట్‌కు చేరాలి.

స్వాగత వేదిక ఏర్పాటు..

గణేష్ విగ్రహాలకు స్వాగతం పలుకుతూ గాంధీచౌక్‌లోని గణేష్ కేంద్ర ఉత్సవ కమిటీ వేదికను ఏర్పాటు చేసింది. మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా, డీఆర్‌ఓ రామునాయక్, ఆర్‌డీఓ విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ శేషన్న, గణేష్ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణారెడ్డి, అధ్యక్షుడు గంగిశెట్టి విజయకుమార్ నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా చేసుకోవాలి


నిమజ్జనం ఘాట్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఎస్పీ, మున్సిపల్ అధికారులు

ఆళ్లగడ్డ: పట్టణంలో కొలువు దీరిన వినాయక విగ్రహాల నిమజ్జన వేడుకలు ప్రశాతంగా నిర్వహించుకోవాలని ఆళ్లగడ డీఎస్పీ ప్రమోద్ అన్నారు. ఆదివారం నిమజ్జనం నిర్వహించే ఘాట్‌లో చేపడుతున్న ఏర్పాట్లు, సౌకర్యాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం కార్యక్రమం పూర్తి చేసుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తల్లిదండ్రులు పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఈయన వెంట పట్టణ సీఐ యుగంధర్, మున్సిపల్ కమిషనర్ కిషోర్ ఉన్నారు

వైభవంగా వినాయక నిమజ్జనం

దొర్నిపాడు: మండల కేంద్రం దొర్నిపాడులో శనివారం వినాయక నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. గత నాలుగుల రోజులుగా ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథులను భారీ ఊరేగింపు మధ్య స్థానిక కేసీ కేనాల్‌లో నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా రంగులు చల్లుకుంటూ చిన్నారులు, పెద్దలు సందడి చేశారు.

యువత సన్మార్గంలో నడవాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

గోస్పాడు: యువత సన్మార్గంలో నడవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. నంద్యాలలో ఎయిడ్స్‌పై అవగాహన జిల్లా స్థాయి సమావేశాన్ని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి డాక్టర్ శారదబాయి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 09వ తేది ఉదయం 6గంటకు పట్టణంలో జిల్లా స్థాయి మారథాన్ 5కి.మీ పరుగు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 17 నుంచి 25 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు, యువతీ యువకులు పాల్గొనవచ్చని తెలిపారు. అనంతరం జిల్లా లెప్రసి, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి జాజుల్ హక్ పదవీవిరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాలం చెల్లిన ఆహారం అందించరాదు

ఉయ్యాలవాడ : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం కాలం చెల్లినవి ఉంటే గర్భిణులు, చిన్నారులకు అందజేయరాదని ఐసీడీఎస్ సీడీపీఓ తేజస్విని సూచించారు. శనివారం స్థానిక 4వ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తల సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ యాప్‌లో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేయాలన్నారు. వర్షాకాలం కావడంతో కేంద్రాలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చిన్నారులకు ఏదైనా జబ్బులు చేస్తే తగిన వైద్యం అందేలా తల్లిదండ్రులకు తెలియజేసి వైద్య సేవలు ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

నంద్యాల(న్యూటౌన్): అన్ని ఉద్యోగాల కన్నా ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని నంద్యాల డయాసిస్ అధ్యక్షుడు (పీఠాధిపతి) బిషప్ సంతోష్ ప్రసన్నరావు అన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని ఎస్పీజీ హైస్కూల్ హెచ్‌ఎం జీవలత ఉద్యోగ విరమణ కార్యక్రమం జరిగింది. ఉద్యోగులు, హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-1, 2 చర్చిల సభ్యులతో పాటు హోలీక్రాస్ గర్ల్స్ హైస్కూల్ సిబ్బంది, ఉపాధ్యాయులు, బంధువులు పూలమాలలతో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిషప్ మాట్లాడుతూ బాధ్యతాయుతంగా ఉపాధ్యాయ వృత్తిలో పని చేసినప్పుడే మన్ననలు పొందుతారన్నారు. కార్యక్రమంలో డీఈఓ జనార్ధన్‌రెడ్డి, బర్ప్ అధినేత పాల్‌రాజారావు, గురువులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు వేతనాలు తక్షణమే చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల వేతనాలు తక్షణమే చెల్లించాలని ఆ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, రాష్ట్ర నాయకులు భారతమ్మ, రాష్ట్ర కోశాధికారి నాగేశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ 18 నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే జీవనం ఎలా గడుస్తుందని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి వేతనాలు వెంటనే విడుదల చేయకపోతే సీఐటీయూ, తదితర సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నంద్యాల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా నిర్మల, నాగేశ్వరరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుబ్బరాయుడు, కోశాధికారిగా రమాదేవి, ఉపాధ్యక్షులతో పాటు 27 మందితో కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ..

ఉయ్యాలవాడ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండల పరిధిలోని తుడుమలదిన్నె గ్రామానికి చెందిన విజయరాజు(59) చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందాడు. ఏఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు. కుమారుడు ప్రవీణ్‌తో కలిసి విజయరాజు ఈ నెల 25వ తేదీన కోవెలకుంట్ల పట్టణానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. అల్లూరు స్కూల్ దగ్గరికి రాగానే ద్విచక్ర వాహనాన్ని కుక్క ఢీకొట్టింది. దీంతో ఇరువురు కింద పడ్డారు. వెనుక వైపు కూర్చున్న విజయరాజు తలకు బలమైన రక్త గాయాలు కావడంతో ప్రథమ చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల, అదే రోజు రాత్రి మెరుగైన వైద్యం కోసం నంద్యాల ఆసుపత్రికి తరలించారు. అయితే, అక్కడ కోలుకోలేక మృతి చెందారు. ఈమేరకు ప్రవీణ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ స్పష్టం చేశారు.


రైతుల ఇబ్బందులు పట్టని కూటమి సర్కారు


ఇంజేడులో మాట్లాడుతున్న ఆళ్లగడ్డ మాజీ శాసన సభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి

ఉయ్యాలవాడ : కూటమి ప్రభుత్వానికి రైతుల ఇబ్బందులు పట్టడం లేదని, అవసరమైన ఎరువులు అందించకుండా కృత్రిమ కొరత సృష్టిస్తోందని ఆళ్లగడ్డ మాజీ శాసన సభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి విమర్శించారు. శనివారం మండలంలోని ఇంజేడు గ్రామంలో మండల ఉపాధ్యక్షుడు గజ్జెల క్రిష్టారెడ్డి స్వగృహంలో నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియాను రైతు సేవా కేంద్రాలు, సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు అందించవలసి ఉందన్నారు. అయితే, జిల్లా మార్క్‌ఫెడ్ సంస్థ నుంచి వస్తున్న యూరియాను కూటమి నాయకులు ఎవ్వరికి చెబితే వారికి మాత్రమే అందజేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబునాయుడు ఎప్పుడు అధికారంలో ఉన్నా రైతులకు మోసం జరుగుతుంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగానే ఎరువులు, విత్తనాలు అందించామన్నారు. నాడు వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశామన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని రైతులు పనులు వదులుకొని ఎరువుల కోసం రోడ్లెక్కి ధర్నాలు, రాస్తారోకోలు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు బుద్దా చంద్రమోహన్‌రెడ్డి, విజయ పాలడెయిరీ డైరెక్టర్ కామిరెడ్డి విశ్వనాథరెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ కూలూరు నరసింహారెడ్డి, నాయకులు కామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, కర్రెపు చలపతిరెడ్డి, గొట్లూరు సుధాకర్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, ముసాని శివానందరెడ్డి, కర్నాటి చంద్రహాస్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పూజలందుకుంటున్న గణనాథులు


బాల్కొండ హాల్ వీధిలో..


శిల్పాటవర్స్‌లో

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని కొలువుదీరిన గణనాథులు భక్తాదుల నుంచి ప్రత్యేక పూజలు అందుకుంటున్నారు. శనివారం ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అపార్ట్‌మెంట్‌లలో చిన్న పిల్లలతో భగవద్గీత శ్లోకాలు, మ్యాజిక్‌షోలు నిర్వహించారు. బాల్కొండ హాల్ వీధిలో 15 అడుగుల మహాగణపతి, ఎస్‌బీఐ కాలనీలోని శిల్పాటవర్స్‌లో 6 అడుగుల మట్టి విగ్రహాన్ని భక్తులు దర్శించుకున్నారు. వీరికి నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. చిన్నారులకు జానపద భక్తి గీతాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

చాగలమర్రి: మండలంలో వెలసిన 89 గణనాథులకు నాలుగో రోజు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చాగలమర్రిలోని బసవన్న కట్ట వీధి రామాలయంలో కొలువు దీరిన గణపతికి శనివారం ఉభయదారులు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చుండూరు వెంకటరమణ, జయలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవాసవి యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రీఅయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌కుమార్

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం ఉద్ధృతం చేయనున్నట్లు సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో కార్పొరేట్ శక్తులకు పాలకులు ఊడిగం చేస్తున్నాయన్నారు. 11ఏళ్ల కాలంలో నరేంద్రమోదీ దేశ సహజ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. మతం పేరుతో ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. పీ -4 పేరుతో పేదలను బంగారు కుటుంబాలుగా మార్చుతామని చెప్పడంలో అర్థం లేదన్నారు. ఉపాధి అవకాశాలు కల్పించకుండా పరిశ్రమలు స్థాపించకుండా, పేదలకు భూములు పంచకుండా పేదల జీవన పరిస్థితులు ఎలా మెరుగు పరుస్తారని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ చార్జీల భారాన్ని మోపుతున్నారని, మండిపడ్డారు. వీటికి వ్యతిరేకంగా ప్రజలను ఆందోళనకు సమాయత్తం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు రామచంద్రుడు, తోటమద్దులు, రత్నమయ్య, పుల్లా నరసింహులు, బాలవెంకట్‌తో పాటు మహమ్మద్‌గౌస్, మౌలాలి, వెంకటలింగం, గోస్పాడు, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, పాణ్యం, గడివేముల, మహానంది మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి


ముత్తలూరు గ్రామ సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డీడీఓ

రుద్రవరం: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని డీడీఓ శివారెడ్డి సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలంలోని ముత్తలూరు, చందలూరు, ఆలమూరు గ్రామ సచివాలయాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయాల్లోని పలు రికార్డులను పరిశీలించారు. అలాగే స్పిందితో కలిసి ఆయా గ్రామాల్లోని పలు కాలనీలు కలియ తిరిగి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.అక్కడక్కడ పేరుకు పోయి నిల్వ ఉన్న చెత్తా చెదారాన్ని కార్మికులతో తొలగింపజేశారు. డీడీఓ వెంట ఎంపీడీఓ భాగ్యలక్ష్మి ఉన్నారు.

పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు


పెద్దయమ్మనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

ఉయ్యాలవాడ : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ పేర్కొన్నారు. శనివారం మండలంలోని పెద్దయమ్మనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది హాజరుపట్టిని పరిశీలించారు. రోగులకు సరిపడే మందులు అందుబాటులో ఉన్నాయా లేదా గడువు తేదీ ముగిసిన ఔషధాలను ఏం చేస్తున్నారు అని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులకు ప్రసవాలు శ్రేయస్కరమని, దీనిపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించవలసిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. ఆరోగ్య కేంద్ర ఆవరణలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు.

దొర్నిపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఓపీ రికార్డులు, మందులను పరిశీలించారు. జాతీయ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యక్రమాల మెటీరియల్‌ను ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా ప్రదర్శించాలన్నారు. ప్రతి గర్భిణీ వీలైంతవరకు సహజ కాన్పు చేయాలన్నారు. జేఎస్‌వై, జేఎస్‌ఎస్‌కే కార్యక్రమాల కింద రావాల్సిన రాయితీలను సరైన సమయంలో వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి శివ, సీహెచ్‌ఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్

నంద్యాల(న్యూటౌన్): ఉపాధి హామీ కూలీల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఉపాధి కూలీలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని, ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న క్షేత్రస్థాయి ఉద్యోగులకు వేతనాలు పెంచి పని భద్రత కల్పించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 వారాలుగా ఉపాధి కూలీలు బకాయిలు విడుదల కాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిర్వీర్యం చేస్తుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ఉపాధి కూలీలకు పనిదినాలు పెంచి పనిముట్లు ఇవ్వాలని, రోజుకు కూలీ రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాధాకృష్ణ, బాబాఫక్రుద్దీన్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదాయాన్ని గండికొడుతున్నారు


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

నంద్యాల(న్యూటౌన్): మార్కెట్ గేట్లకు బహిరంగ వేలం వేయకుండా మున్సిపల్ అధికారులు అధికార పార్టీ నాయకులతో చేతులు కలిపి ప్రభుత్వ ఆదాయాన్ని గండికొడుతున్నారని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ ఆరోపించారు. ఈ దోపిడీతో మున్సిపాలిటీకి తీవ్ర నష్టం చేకూరుతుందని, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నంద్యాల మార్కెట్‌కు 5 నెలలుగా వేలం జరగడం లేదన్నారు. ప్రతి సంవత్సరం 80 లక్షలకు పైగా ఆదాయం వస్తుందని, దీనిని కొందరు రాజకీయ నాయకులు స్వాహా చేస్తున్నారని విమర్శించారు. అవినీతికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ గవర్నర్‌కు సన్మానం


మౌలానా అబ్దుల్ మజీద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ గవర్నర్ అబ్దుల్ మజీద్‌కు నంద్యాల మిల్లీ కౌన్సిల్ కార్యాలయంలో శనివారం సన్మానం చేశారు. మిల్లీ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు గౌస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మిల్లీ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఉస్మాన్ బాషా మాట్లాడుతూ మౌలానా అబ్దుల్ మజీద్ మదరసాలతో పాటు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్‌లో కేంద్ర సభ్యుడిగా ఉంటూ పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఆయన సేవలను గుర్తించిన జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆయనకు ఇటీవల పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించిందన్నారు. కార్యక్రమంలో సభ్యులు మాబాషా, పఠాన్ షఫీవుల్లాఖాన్, జీఎం వసీం, తదితరులు పాల్గొన్నారు.